Guest Editorial on the occasion of New year... 01/01/2007

# అభినందన మందార మాల

By

నిషిగంధ

చిన్నప్పుడు ప్రతి సంవత్సరం వేసవిలో పరీక్షలైపోయిన తర్వాత మా అమ్మా నాన్న నన్నూ, మా తమ్ముడిని ఎగ్జిబిషన్ కి తీసుకెళ్ళేవారు.. ఆ గ్రౌండ్స్ లో సగం తిరిగిన తర్వాత ఆ తిరుగుడికి విపరీతంగా దాహం వేసేది. మా బాధ చూడలేక మా నాన్న చెరొక గోల్డ్ స్పాట్ కొనిపెట్టేవారు.. అప్పుడే ఐస్ పెట్టెలోనించి తీసిన ఆ రంగు నీళ్ళు గొంతు లో జారుతుంటే చాలా హాయిగా అనిపించేది. వేసవి కావటం వలన ఆ తర్వాత కొద్దిసేపటికే మళ్ళీ నాలుక పిడచకట్టుకున్నట్లు అనిపించేది.. మా అవస్థ తనకి ముందే తెలిసినట్లు అమ్మ బయటకి రాగానే చెరుకురసం ఇప్పించేది.. మళ్ళీ ఆ ఐస్ వేసిన తీయని పానీయం తాగగానే పొట్టలో కాస్త ఉపశమనం కలిగేది.. ఇంత చేసినా గొంతు మాత్రం ఇంకాసేపవ్వగానే దాహం అనేది.. చివరగా ఇంటికి వచ్చి కుండలోని నీళ్ళు పెద్ద గ్లాసు నిండా తాగితేగానీ ఆ తపన తీరేది కాదు!!!

ఈనాడు వార్తాపత్రిక 'ఈతరం ' అనుబంధంలో వచ్చిన శ్రీనివాస్ గారి ఆర్టికల్ చదివిన తర్వాత చిమటమ్యూజిక్.కామ్ అభిమానిగా నా అభిప్రాయాలను పంచుకోవాలనుందని ఆయనని అడిగాను.. శ్రీనివాస్ గారు సరే అన్నారు సరే, కానీ ఎక్కడి నించి మొదలుపెట్టాలో అర్థం కాక ఆలోచిస్తుంటే పైన చెప్పిన నా అనుభవం గుర్తుకొచ్చింది.. సరిగ్గా ఇదే పరిస్థితి US లో నా ఒకప్పటి జీవిత విధానానికి, తెలుగు పాటలకి వర్తిస్తుందని అనిపించింది.

US కి వచ్చిన చాలా రోజుల వరకూ ఇక్కడి కొత్తదనానికి అలవాటుపడుతూ, ఆకర్షణీయంగా కనిపించే అనేకరకమైన విషయాలవైపు కళ్ళు సీతాకోకచిలుకలా పరుగులు పెట్టేవి. మనసు మాత్రం మన మట్టివాసన, పాత పాటలు, సాహిత్యం, నేనెప్పుడు బయటకు వెళ్ళినా అమ్మ గేటుకు తగిలించే ఎదురుచూపులను మోస్తూ ఉండేది.. అదే వర్షం కదా మరి ఇక్కడ మట్టి అసలు వాసన రాదేంటి!? అమ్మ ఇంకా మాటిమాటికీ గేటువైపుకి చూడటంలేదు కదా!! మళ్ళీ శరత్ సాహిత్యం ఎప్పుడు చదువుతానో!? నాకెంతో ఇష్టమైన పాటలు నెట్లో దొరకటం లేదేంటి!? ఇవే అలోచనలు.. ఎంత ఆనందంగా ఉన్నా మనసు ఇంకా దేనికోసమో అటూ ఇటూ వెదుకుతున్నట్లే అనిపించేది..

నాకు సంగీతం అన్నా సాహిత్యం అన్నా చాలా ఇష్టం.. చిన్నప్పటి నించి రేడియో వినటం ఎంత అలవాటో పుస్తకాలు చదవటం అంతే అలవాటు.. ఆదివారాల్లో మా నాన్న పునుగులు, బజ్జీలు లాంటివి తెస్తే వాటిని గబ గబా ప్లేట్లలో పెట్టేసి ఆ పొట్లాల పేపర్ ని కూడా వదలకుండా చదివేదాన్ని!! ఎవరు ఇండియా నించి వస్తున్నా నీకేమి కావాలని అడిగితే పుస్తకాల లిస్ట్ చెప్తాను.. అలా సాహిత్యంపై నాకున్న అభిరుచిని కొనసాగిస్తూనేఉన్నాను.. కానీ అదే సంగీతంలో ఈ మధ్య వరకు సాధ్యం కాలేదు..

ఉదయాన్నే బయటకి రాగానే సున్నితంగా స్పృశించే పిల్ల తెమ్మెరలు.. వర్షాకాల సాయంత్రాన కిటికీ లోంచి అప్పుడప్పుడూ చిలిపిగా పలుకరించే వానజల్లు.. చల్లగా నవ్వే పున్నమి నాటి పూర్ణ చంద్రుడు.. ఇప్పటికే ఎన్నోసార్లు ఆస్వాదించినా మళ్ళీ మళ్ళీ కావాలనుకుని ఎదురుచూసే అనుభవాలు.. అలానే 'ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకు ' (ఈనాటి బంధం ఏనాటిదో), 'మీటిచూడు హృదయాన్ని ' (చీకటి వెలుగులు), 'జాబిల్లి చూసేను నిన్నూ నన్నూ ' (మహాకవి క్షేత్రయ్య)... ఇంకా ఎన్నెన్నో 70, 80 వ దశకాల పాటలు కూడా!! ఎన్నిసార్లు విన్నా మళ్ళీ వినడానికి మనసు జ్ఞాపకాల తలుపులు తెర్చుకుని ఆయత్తమౌతుంది.

ఎప్పుడోగానీ వినబడని ఒకటీ అరా మంచి పాటల కోసం కొత్త తెలుగు పాటలను వినకుండా ఉండలేను.. అడపాదడపా మంచి పాటలు వినబడుతున్నా అవి మనసుని అంటిపెట్టుకునే సమయం చాలా తక్కువ. ఆ ఐస్ / గాస్ తో కలిసిన తీయని పానీయాలేమీ నా

దాహాన్ని తీర్చనట్టే పరభాషా గాయకుల స్వరాలు, సాహిత్యాన్ని అధిగమించే వాయిద్యాల హోరుతో కలిసిన పాటలు మనసు దాహాన్ని ఇంకా పెంచుతాయి అనిపిస్తుంది. మనసు మళ్ళీ అలనాటి మధుర గీతాలవైపు అప్రయత్నంగా అడుగులు వేస్తుంది.. 'Best of Kishore Kumar', 'Classic hits of Lata', 'Unforgettable Hemant Kumar' అంటూ కోకొల్లలుగా హిందిలో అన్ని దశకాల్లోని పాటలు వస్తుంటాయే మరి తెలుగులో ఎందుకు లేవు!?!? మైండ్ లో ఎక్కడో వెనుకగా 'కనురెప్ప పాడిందీ'... 'ఇదే ఇదే నేను కోరుకుందీ' లాంటి పాటలు లీలగా వినబడుతూ... ఇంత మంచి పాటలు మళ్ళీ వింటానో లేదో అనే సందేహం.. ఫ్రెండ్స్ ని 'నీకీ పాట తెలుసా.. ఆ పాట నీదగ్గరుందా' అని అడుగుతూ నిరంతర అన్వేషణ...

నా ఈ పాటల పిచ్చి తెలిసిన ఫ్రెండ్ ఒకరోజు చిమటమ్యూజిక్.కామ్ గురించి చెప్పినపుడు ఇది కూడా మిగతా వాటిలానే ఒక మామూలు పాటల సైట్ అనుకుని పెద్దగా పట్టించుకోలేదు.. తర్వాత చాలాసేపటికి కాస్త తీరిక దొరికితే సైట్ కి వెళ్ళి చూసాను.. 'నా కళ్ళని నేనే నమ్మలేకపోవడం ' అంటే ఏమిటో ఇంకోసారి అనుభవమైంది.. ఇంకెప్పుడూ విననేమో అనుకున్న పాటలన్నీ కళ్ళ ముందే వరుసగా!!!అంతే! చిమటమ్యూజిక్ నా దైనందిన జీవితంలో అతి ముఖ్యభాగమైపోయింది.. ప్రతి పాటనూ పదే పదే వింటూ.. అవి ఇంతకు ముందు ఎప్పుడు విన్నానో, ఎందుకంత ఇష్టమో, ఆ సినిమా ఎప్పుడు చూశానో ఇత్యాది విషయాలన్నీ ఇంట్లో మా శ్రీవారికి వినిపిస్తూ.. నిజంగా మనసు మళ్ళీ కొత్త జీవం పోసుకుందేమో అన్న ఫీలింగ్.. అనుభవించాలే కానీ మాటల్లో చెప్పలేనిది!!!

కథానాయకుల పేరులనుబట్టి పాటలను లిస్ట్ చేసినందుకు మొదట కాస్త కినుక వహించినా (j/k) చిమటమ్యూజిక్ లోకి ఎంటర్ అవ్వగానే ఎంతో ఆహ్లాదంగా అనిపిస్తుంది.. ప్రతి సైట్లోనూ ఫ్లాష్ లు, పాప్ అప్ లతో విసిగిన కళ్ళకు ఎంతో సరళంగా ఉన్న ఈ సైట్ డిజైన్ వలన నిజంగానే పర్ణశాల లోకి వచ్చిన నిర్మలమైన భావం... రోజులు గడిచే లొద్దీ ఈ సైట్ ఎంతమంది అభిమానాన్ని చూరగొన్నదో గెస్ట్ బుక్ ఎంట్రీస్ చదువుతుంటే అర్ధమౌతుంది.. ఆనాటి మధురగీతాల తృష్ణ ఉన్న నా లాంటివారు ఇంకెందరో ఉన్నారని మెల్లగా అవగతమైంది.. ఇంకా Discussion Board లో కూడా అలనాటి పాటలకి సంబంధించిన ఎన్నో interesting విషయాలపైన చర్చలు జరుగుతుంటాయి.. నాకు సమయం సరిపోక వాటిల్లో పాల్గొనలేక పోయినా వీలు కుదిరినప్పుడల్లా చదువుతుంటాను..

ఇంకొక అభినందనీయమైన విషయం ఏమిటంటే, సైట్ మొదలుపెట్టిన నాటి నించి నేటి వరకూ శ్రీనివాస్ గారు ప్రతిరోజూ సైట్ ని మెయిన్ టెయిన్ చేస్తూనే ఉన్నారు.. నాకిష్టమైన పాటలన్నీ సైట్లో upload చేసేశారు, ఇంక నేను వెతుకుతున్న/వినాలనుకున్న పాటలు ఏమీ లేవు అనుకుని సైట్ ఓపెన్ చేసిన ప్రతీసారి surprise అవుతుంటాను.. ఆశ్చర్యమో.. అద్భుతమో.. ఒకప్పుడు నాకెంతో ఇష్టమైన/దాదాపుగా మర్చిపోయిన పాట మళ్ళీ 'new ' అనే టాగ్ తో మెరుస్తూ కనబడుతుంది.. అంతే! ఆనందంతో మనసు మొగ్గలు వేస్తుంది :)) అలా నన్ను surprise చేసిన పాటల్లో కొన్ని 'ఈ గీతం.. సంగీతం' (మహాలక్ష్మి), 'నా హృదయమా' (ప్రియ), 'యమునా తీరాన.. రాధ మదిలోన ' (గౌరవం), etc.. ఇక్కడి (US) దైనందిన జీవితం ఎలా ఉరుకులు పరుగులు మీద సాగుతుందో చాలా మందికి తెలుసు.. ఎంతో బాధ్యతాయుతమైన పదవిలో ఉద్యోగం చేస్తూ, ఇద్దరు చిన్న పిల్లలతో రోజుకి ఇంకో పది గంటలు ఉంటే ఎంత బావుంటుంది అనుకునే పరిస్థితులలో కూడా తన విలువైన సమయాన్ని సైట్ / పాటల అభిమానుల కోసం వెచ్చించటం కొనియాడతగిన విషయం.. ఇందుకు తన సహకారాన్ని అందిస్తున్న శ్రీనివాస్ గారి శ్రీమతిని కూడా ఎంతో అభినందించాల్సిందే!!

శ్రీనివాస్ గారు ఎప్పుడూ ప్రస్తావిస్తూ ఉంటారు తన ఈ ప్రయత్నం వెనుక తన కుటుంబ సభ్యులు, మిత్రులు, ఇంకా ముఖ్యంగా సూర్య గూడూరు గారి సహాయం ఎంతో ఉందని. శ్రీనివాస్ గారికి కావాల్సిన సహాయాన్ని, ప్రోత్సాహాన్ని అందిస్తున్న వీరందరికి మనస్పూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.. నాకింకా గుర్తుంది! కొన్నేళ్ళ క్రితం 70, 80ల దశకాల్లోని కొన్ని పాటలను రికార్డ్ చేయిస్తూ 'ఈ కాలం పది కాలాలు బ్రతకాలనీ' (దేవుడే గెలిచాడు) పాట కోసం విజయవాడలో 3,4 రికార్డింగ్ షాప్స్ లో వెదికాను.. ఎక్కడా దొరకలేదు.. కానీ పాట మాత్రం మనసుని వదల్లేదు.. చిమటమ్యూజిక్ తో పరిచయం ఏర్పడ్డాక ఆ పాటపై ఇంకా వదలని ఆశతో శ్రీనివాస్ గారికి request email పంపాను.. పాటని upload చేసినట్లు ఆయనిచ్చిన రిప్లై చూసీ చూడగానే వెంటనే ఆ పాట వినడం మొదలుపెట్టాను.. ఎన్నో ఏళ్ళ తర్వాత విన్నానేమో ఆ భావోద్వేగానికి కళ్ళు నిండుకున్నాయంటే అతిశయోక్తి కాదు!! ఆ పాటని పంపిన సూర్య గారికి, వెంటనే upload చేసిన శ్రీనివాస్ గారికి మనసులో ఎన్నో కృతజ్ఞతలు తెలుపుకున్నాను..

ఇలా కేవలం తనకి నచ్చిన/బాగా తెల్సిన పాటలనే కాకుండా శ్రోతలు కోరుతున్న పాటలను కూడా సూర్య గారి సహాయంతో వెదికి పట్టుకుని upload చేస్తున్నారు... మరి చిమటమ్యూజిక్.కామ్ జనరంజని కంటే ఎందులో భిన్నమైనది!? ఇంకా చెప్పాలంటే జనరంజని కంటే రెండు విషయాలలో చిమటమ్యూజిక్ ఇంకాస్త మెరుగని నాకనిపిస్తుంది.. no advertisements & available 24x7 !!!! ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే, మిగతా ఏ మ్యూజిక్ సైట్స్ లో కేవలం ఒక సినిమా పాటలను మాత్రమే వినగలం, పైగా ఒక సినిమాలోని అన్ని పాటలు మనకు నచ్చకపోవచ్చు! అదే చిమటమ్యూజిక్.కామ్ లో అయితే ఒకేసారి 100 కు పైగా పాటలను select చేసుకుని వినే సౌలభ్యం ఉంది!! ఇక్కడ పాటలను విభజించిన పద్ధతి వలన ఎన్నో మంచి సినిమాలలోని ఇష్టమైన పాటలను ఒక్కసారి select చేసుకుని వినవచ్చు.. ఇది నాకు బాగా నచ్చిన ఫీచర్!! ఈ సౌకర్యంతో నా పరిస్థితి 'మాయాబజార్' లో నోరూరించే అనేక రకాల పిండివంటల ముందు కూర్చున్న ఎస్వీ రంగారావుగారిలా మహదానందంగా ఉంటుంది :-)

వేరే సైట్లో చూడని ఇంకొక మంచి విభాగం 'Kids Section'! ఎన్నో చక్కని పిల్లల పాటలు ఇందులో ఉన్నాయి. అలానే 'Best Solo', 'Best Romantic', 'Devotional', 'Patriotic', etc.. లాంటి sections లో సైట్ లో ఉన్న పాటలను సందర్భానికి తగినట్లు వినే అవకాశం ఉంది... 'చింతామణి' మన పెదవులపై అప్రయత్నంగా నవ్వులు పూయిస్తే, 'దానవీరశూరకర్ణ డైలాగ్స్' అచ్చెరువు చెందేలా చేస్తాయి. అంతే కాకుండా పాటలను సంగీత దర్శకులను బట్టి కూడా విభజించడం ఆయా సంగీత దర్శకుల అభిమానులను ఎంతగానో అలరిస్తుందని నా అభిప్రాయం!

ప్రతి ఒక్కరికీ ఏదో ఒక అభిరుచి ఉంటుంది.. తమలాంటి అభిరుచి ఉన్నవాళ్ళు ఇంకా ఎంతోమంది ఉంది ఉంటారని కూడా తెలుసు. కొంతమంది కేవలం తమ అభిరుచిని తలచుకుంటూ ఉంటారు.. ఇంకొంతమంది ఆ అభిరుచిని నిలుపుకోవడానికి చిన్న చిన్న ప్రయత్నాలు చేస్తుంటారు. మరి కొంతమంది తమ ప్రయత్నాలను స్నేహితులతో పంచుకోవడం వరకూ చేస్తారు. కానీ శ్రీనివాస్ గారు, సూర్య గారు లాంటి వారు తమ లాంటి అభిరుచి ఉన్న, ఏమాత్రం పరిచయం లేని అభిమానులతో తమ ప్రతిఫలాన్ని పంచుకుంటున్నారు.

ఆపాత మధురాలైన పాటలను సేకరించి వాటిని సైట్ లోకి upload చేయటం వ్యయప్రయాసలతో కూడుకున్నది... ఇంత కష్టమైన పనిని ఇష్టంగా చేస్తూ, తమ విలువైన సమయాన్ని మా కోసం వెచ్చిస్తున్న శ్రీనివాస్ గారికి, సూర్య గారికి మనస్పూర్తిగా కృతజ్ఞతలు తెలియచేసుకుంటూ.. వారికీ, చిమటమ్యూజిక్.కామ్ శ్రోతలకు మరియు వారి కుటుంబసభ్యులందరికీ హృదయపూర్వక నూతన సంవత్సర శుభాకాంక్షలను అందిస్తున్నాను.. చిమటమ్యూజిక్.కామ్ నూతన సంవత్సరంలో ఇంకెన్నో మంచి పాటలను, శ్రోతలను పోగుచేసుకుంటూ నూతన ఉత్తేజంతో సాగాలని కోరుకుంటున్నాను..

మొక్కలకు నీళ్ళు పోస్తూ.. పిల్లలతో ఆడుకుంటూ.. ఇంటిపని చేసుకుంటూ.. ఆఫీసులో డెడ్ లైన్స్ తో కుస్తీ పడుతూ.. వెన్నెల రాత్రుల్లో జాబిల్లితో కబుర్లు చెప్తూ.. ఏ సమయం అయితేనేమి.. ఏ పని చేస్తున్నా కానీ, ఇప్పుడు జనరంజని నా సమక్షంలోనే!!!

PS: రోజులు గడిచేకొద్దీ మన దేశంతో నాకున్న అనుబంధాన్ని పటిష్టం చేసుకుంటూ, నా చిన్ననాటి ఇష్టాల్ని, అభిరుచులను నిలుపుకోవడానికి ప్రయత్నిస్తున్నాను.. చిమటమ్యూజిక్.కామ్ పుణ్యమా అని నాకు పాటల కొరత కూడా తీరిపోయింది.. ఇక మిగిలింది ఒకటే కోరిక! వేసవిలో చల్లని లేత ముంజెలు తినాలని!! Any help? Any suggestions?? :-))

రచయిత్రి గురించి: విజయవాడ లో పుట్టి పెరిగిన నిషిగంధ గారు గత 8 సంవత్సరాలుగా Miami, Florida, USA లో నివాసం ఉంటున్నారు.. పుస్తక పఠనం, పాటలు వినడం, స్నేహితులతో గంటల కొద్దీ కబుర్లు చెప్పుకోవడం తనకు అత్యంత ఇష్టమైన అభిరుచులు.. అప్పుడప్పుడూ మనసుని కదిలించిన భావాలను కవితల రూపంలో వ్యక్తపరచడం వదిలించుకోలేని అలవాటని అంటారు :) ఈ సైట్ లోని Other Links page నుండి నిషి గారు రాసిన కొన్ని కవితలను మీరు చదవొచ్చు.